# మమకారం

పాప యేడ్చింది !

కిచెన్ రూములోంచి మా ఆవిడ సద్గుణా, డ్రాయింగ్ రూములోంచి మా అమ్మా గాభరాగా - బెడ్‌రూములో పాప ఊయల దగ్గరకు పరుగెత్తేరు.

డ్రాయింగ్ రూములో టీవీ ..

" ఉడ్‌వర్డ్స్ పట్టు. చిన్నప్పుడు నేనూ నీకు అదే పట్టేదాన్ని" విన్పించింది. రాత్రి యేడున్నర వార్తల కోసం చూస్తున్నాను నేను.

మా పాపకు మొదటి పుట్టిన రోజు జరిగి ఆర్నెళ్ళయింది. నన్నూ, వాళ్ళమ్మనీ, నాన్నమ్మనీ పోల్చుతుంది. చేతులూ, కాళ్ళూ టప టపా ఆడిస్తుంది .. యెత్తు కొమ్మని !ఎత్తుకుంటే యేడుపు ఆ పేస్తుంది. ఆ మాత్రం దానికి ఉడ్ వర్డ్స్ యెందుకు .. ?

అయితే, నిన్నట్నించీ అజీర్ణం చేసిందేమో కడుపులో నొప్పి వస్తుందేమో ? ఏడుస్తూ నడుము యెత్తుతుంది. పాపని మా అమ్మ తీసి యెత్తుకొని..

" ... చూసేవా ? నడుం విరుస్తోంది ! కడుపులో నొప్పే. అజీర్ణం నొప్పి అది ! వామూ, జీలకర్ర పొడిగా చేసి .. పాలల్లో కలిపి నులి వెచ్చగ వేడి చేసి పడితే ఠక్కున తగ్గిపోతుంది " అంటోంది.

" ఇప్పుడవన్నీ యెక్కడతేనూ ? టీవీలో చెప్పారుగా .. గ్రైప్‌వాటరుంది. అదే పడదాము" అని గ్రైప్‌వాటర్ పట్టింది సద్గుణ.

సద్గుణ అన్నీ టీవీలో చెప్పినవే కొంటుంది. వంటగదీ, డ్రాయింగ్ రూమూ .. టీవీ లో చెప్పిన సరంజామాతో నింపింది.

మా అమ్మ - శ్రీరామ పట్టాభిషేకం పటానికి మొక్కే భక్తురాలు, సద్గుణ - సాయి మఠం భక్తురాలు. ఇన్‌స్టెంట్ పరిష్కారాలు - యీతరం వారికి కావాలి. అందుకే గ్రైప్‌వాటర్ పట్టింది మా శ్రీమతి.

పాపా యేడుపు ఆపలే ! సద్గుణ - నుంచి పాపను తీసుకొని - మా అమ్మ భుజమ్మీద వేసుకొని జోకొడ్తోంది. గదిలో అటూ, ఇటూ తిరుగుతోంది. గోల చేస్తున్న టీవీని ఆపేస్తూ, టీవీ వైపు చూపుతూ -

" దీనబద్ధాలు ఆరిపోను ! అన్నీ అబద్ధాలే. మా చిన్నప్పుడు మా అమ్మగానీ, నీ చిన్నప్పుడు నేను గానీ - యేట్రదీ - వుడ్డువోర్డ్సా - అదసలు పట్టనే పట్టలేదు. అసలెరగే యెరగం. పొద్దుటి పూట వేప మూడికల చేదు పట్టేవాళ్లం. సాయంత్రం వామూ, జీలకర్రా పాలల్లో కలిపి పడితే - అజీర్ణం అన్నదెరగవు. ఇదేం చిత్రం రానాయినా ! ఏడాది పాపకి యెన్ని మందులూ, యెన్ని జబ్బులు ? " అంటూ దండకం ప్రారంభించింది మా అమ్మ.

ఎపుడూ వుండే సోదే గదా అను కుంటూ మా ఆవిడ వంట గదికి వెలిపోయింది. పాప అలాగే మా అమ్మ భుజమ్మీద నిద్రపోయింది.

పాపను నెమ్మదిగా, నిద్రాభంగం కాకుండా ఉయ్యాలలో వేసి, చిన్నగా ఊపి, పాప నిద్రపోయిందని నిర్ధారించుకున్నాక నా దగ్గరకొచ్చి -

" ... యింత ఇల్లు కట్టేవు. బోల్డు డబ్బు పోసేవు. యెందుకూ పెరట్లో ఒక వేపమొక్కా ? ఒక తులసి మొక్కా ? పండూ కాయా కాసే ఒక మొక్కైనా వుందా ? వేప మొక్కెయ్యరా అన్నాను. వేసేవా ? వేప చెట్టు గాలి యెంత మంచిదనుకున్నావు వొంటికి ? వేసేవా ? వెయ్యనే లేదు. నా బలిమిని ... ఆ తులసి మొక్కైన పెట్టాను ... "

మా అమ్మ దండకం ఆపేట్లు లేదు. ఇక్కడుండటం మంచిది కాదని ఈ జీ చెయిర్‌ని పోర్టికో దగ్గరకు యీడ్చుకుపోయేను. మా అమ్మ - నా వెనకాలే వచ్చేసింది. పోర్టికోలైటు వెలుతుర్లో - పోర్టికో యిరువైపులా, ముందరా రంగు రంగుల ఆకుల్తోనూ, పూల తోనూ వెలుగుతోన్న నర్సరీని చూసి -

" యిదిగో ! ఈ బ్రెమ్మ జెముడు డొంకలు పెంచేరు. ఇవే అందమట... అందం యింటికి ! పిల్లా, జెల్లా తిరుగాడే యింటికి - కాయా, పండూ చెట్లక్కర్లేదా . ఇలగేనా మనూరిల మనిల్లుండేది ? " అని నా కొత్త యింటిని యీసడించింది.

అప్పుజేసి పప్పుకూడులా - విశాఖ కొత్తరోడ్‌లో - డాబా యిల్లు కట్టేను నేను. యారాడ కొండ మీది లైట్‌హౌస్ కంటే గొప్ప - నా యిల్లు నాకు !

ఇంతలో మళ్ళీ పాప యేడ్చింది.

మా అమ్మ దండకం ఆపి పరుగెత్తింది.

హమ్మయ్య .. అనుకుంటున్నాను, గేటు చప్పుడైంది !

ఓ చేతిలో గుమ్మడి పండూ, మరో చేతిలో ములగకాడల కట్టా భుజమ్మీద పెద్ద పంచె యిరువైపు కొసల్నీ మూటల్తో నింపీ - గేటు తోసుకొస్తున్న శిమ్మన్న కన్పించేడు. పోర్టికో లైటు వెల్తురులో - కదిలి వస్తోన్న పంట మొక్కలా వున్నాడు శిమ్మన్న.

ఇంట్లోంచి అమ్మ యెలా చూసిందో - పరుగెత్తుకెళ్ళి, శిమ్మన్న చేతిలో బరువందు కుంది. గుమ్మడి పండు నాముందు దింపి - " .......... నీ చిన్నప్పుడు గుమ్మడికాయ అప్పాలు చేస్తే, పెనం కాడ నుంచి కదలకుండ తినీసోడివి !" అని తను జ్ఞప్తికి తెచ్చుకుని, నాకు గుర్తుచేసి నవ్వింది మా అమ్మ !

నిండుగా నవ్వుతోన్న అమ్మ - తులసి మొక్క గాలికి కదలాడినట్లుగా వుంది.

అమ్మ లోనకెల్లి రెండు డబ్బాలు తెచ్చింది. శిమ్మన్న పంచెల మూటలు విప్పేడు. వేరుశెనగకాయలూ, నువ్వులూ డబ్బాల్లో పోసేడు. ఓ వేరుశెనక్కాయొకటి తీసి, వొలిచీ - పెదవిరిచి.

"గింజ నిబ్బరంగ లేదు, ఇలగైతే దిగుబడేమొస్తాది ? " అంది మా అమ్మ .

" ... యేటి జేస్తామమ్మా? పుంజిలు - కాసీ టయింకి - యెండలు ముదిరి పోనాయి. వోనలాగిపోనాయి. మొక్కకొక యేరు దిగితే ఘనం ! యేరుకి ఒక బ్రెండు కాయిలే కాసినాయి. ఇత్తనాలకి రాలేదనుకోమ్మా ...... " చెప్పాడు శిమ్మన్న విచారంగా.

నువ్వులు చూసింది. దోసిలిలో పోసుకుని, డబ్బాలోకి జారుస్తూ - " ఇదేమిటి యిసకతోటి తెచ్చీసేవు ? " అనడిగింది.

"యింకా సెయ్యిలేదమ్మా. అన్నీ అయ్యాక వారం పోతే వద్దుమనుకుంతన్ను. ఇంతలోకి .. రమ్మని కవురెట్నాడు బావు ! ఎందుకో ? యేటో ? అని ఉన్నపాటున బయలెల్నాను. ఉత్తిసేతుల్తోటి రానేక అది అలాగ వొట్టుకొచ్చినాను " అని సంజాయిషీ యిచ్చుకున్నాడు శిమ్మన్న.

మా ఆవిడొచ్చి, శిమ్మన్నని పలకరించి - డబ్బాలు లోనకి పట్టుకు వెళ్ళింది. మా అమ్మ నా వైపు చూసింది - 'కబురు చేసావా ?' అన్నట్టు. నేను చూపు మరల్చుకున్నాను. ఓ క్షణం తర్వాత - "ఉదయం మాట్లాడదాం. శిమ్మన్నా కాళ్ళూ, చేతులు కడుక్కో" అన్చెప్పి లోనకి నడవబోయాను.

"అదేట్రా ? అర్జంటుగ రమ్మన్నోడివి - ఆడు వొచ్చేక చెప్పవేమీ ? ఆ నింపాదేమీ ? అసలొక ముక్కయినా - నాకు చెప్పకుండా .... ఆడికి కబురెందుకు చేసావు ? ఈ పనుల రోజుల్ల ఆడి కిబ్బంది కాదా ? " అంటూ దండకం ప్రారంభించింది అమ్మ.

మా అమ్మకి సస్పెన్సులు నచ్చవు. విడమర్చాలి. లేకుంటే ఒప్పుకోదు. దండకం యెత్తుకుంటుంది. ఆ దండకం వంట గదికీ పాకి, అత్తా కోడళ్ళ వార్‌గా మారి, యింటి వాతావరణం గల్ఫ్ యుద్ధ వాతావరణం కాగలదు.

"... పొద్దుట పడమట రెడ్లు వస్తారు .. " అన్నాను అందుకనే.

"... పడమర రెడ్లా ? ఎవరాళ్ళు ? ఎందుకొస్తారు ? "

".. మన యేరియా పొలాల్లో - చేపల పెంపకం చేస్తారు. రొయ్యలూ, కొర్రమీనులూ.. అవి ! విదేశాలకి పంపిస్తారు. కోట్లమీది వ్యవహారం ... వారిది !" అన్నాను. ఖరీదైన వారితో వ్యవహారంలా ధ్వనించేదుకు పదాల్ని పేర్చుతూ ! అసలు విషయం దాచేస్తూ !

వారం దాకా సీరియల్ సస్పెన్సుకు ఆగని పాఠకురాలిలా - "రొయ్యలేటి? రెడ్లేంటి ? కోట్లేంటి ? ఈ శిమ్మన్నెందుకురా ? " అని గసుర్తున్న ధ్వనిలో ప్రశ్నించింది - విషయం చెప్పమని.

" .. ఇల్లు కట్టడంకి బోల్డు అప్పులు చేసాను. వడ్డీలకి - జీతం తరలిపోతే ... నెలంతా కట కటగుంది" అంటూ సీరియల్ రైటర్ సస్పెన్స్‌ని సాగదీస్తున్నట్లు ... చెప్పాను.

" ... అయితే ? "అని ప్రశ్నించి, నన్ను అనుమానంగా చూసింది.

నేను మరి జవాబు చెప్పలేక పోయేను. మా అమ్మ .. యీనాటి సీరియల్ పాఠకురాలు కాదు .. రచయితలు చెప్పినదాకా గ్రహించలేక పోటాన్కి.. మా తాతయ్య మీద ... తొలిసారిగా కోపమొచ్చింది ! మా అమ్మకు ఆంధ్రమూ, అమరమూ, భారతమూ మాత్రమే గాక పంచరత్నమూ, గాథాసప్తశతి చదివింపించినందుకు !

విషయం గ్రహించిన మా అమ్మ ... ఓ క్షణం మౌనం వహించింది. ఏమేమి ఆలోచించిందో, క్షణం తర్వాత - " యేటీప్పుద్దేశం ? " అని ప్రశ్నించింది చిరాగ్గా.

"చూడమ్మా. పంటలు జూస్తే అంతంత మాత్రం. ఋతువుల్తోటి జూదం - మన దేశంలో వ్యవసాయం. ఆ శిమ్మన్న కౌలుగింజలివ్వలేక, కష్టం మిగిలిపోతోందతనికి. మనకా అప్పులున్నాయి. చేపల పెంపకం గనక - యెక్కువ ధర పలుకుతోంది. ఇలాంటప్పుడే అమ్ముకుంటే లాభం ?" అంటూ మా పొలం అమ్మకానికి అవసరమయిన డిఫెన్సువాదనలో ముఖ్యమైన పాయింట్లు వొదిలేను.

ఇన్ని పాయింట్లనీ .. ఓ చూపుతో ఖండించేసింది మా అమ్మ. ఆ చూపు - బంగారు గుడ్ల కోసం బాతు కడుపు కోసేవాడిని చూసినట్లుగా వుంది !

ఆ తర్వాత గభాల్న లేచింది. ఇంట్లోంచి నీళ్లు తెచ్చి శిమ్మన్నకిచ్చి కాళ్ళు కడుక్కోమంది.సద్గుణాకు కేకేసి - శిమ్మన్నకు భోజనం, పడకా, యేర్పాటు జేయమంది. ఉయ్యాలలోని పాపను తీసి తన మంచమ్మీద వేసుకుంది. పాప మీద ఓ చేయి వేసి .. వొత్తిగిలి పడుకుని దుప్పటి కప్పుకుంది.

భోజనమైనా చేయలేదు. మాటామంతీ లేకుండా దండకం యెత్తుకోకుండా - కొత్తగా యిలా నిరసనకు దిగడం ఆశ్చర్యమేసింది నాకు. భోజనమైనా చేసి పడుకుంది కాదు .. ! సద్గుణ వంటగది సర్దేసింది.

' పాప యేడ్చినా బాగుణ్ణు! అమ్మ లేస్తుంది. భోజనం చేయమని బ్రతిమాలొచ్చు' అనుకున్నాను బెడ్ మీద వాల్తూ ! ఎదురుగా హాల్లో .. అమ్మ దుప్పటిలో దుఃఖం మూటలా వుంది.

అలా బెడ్ మీద వాలిపోయిన నాకు .. మాగన్నుగా నిద్రపడుతున్న వేళ .. యేడుపు సన్నగా విన్పించింది. కళ్ళు తెరిచేను. ఏడ్చింది పాప కాదు, మా అమ్మ!భూమి లోలోతు పొరల్లో కంపించితే వచ్చే - తొలి శబ్దంలా, మా అమ్మ కడుపులో కదిలే దుఃఖం ! మొహం దాకా కప్పుకున్న దుప్పటిలోంచి - అమ్మ అణువణువూ కంపించుతోంది !

ఆ ఊరితోటి, ఆ పొలంతోటి అమ్మకు నలభయ్యారేళ్ళ అనుబంధం. కాళ్ళ పారాణితో అడుగిడి, నలుగురి పిల్లల తల్లిగా మెసిలి, ముసలితనాన - ఒంటరిగా వుండవద్దంటే - నాతో వచ్చింది ! ఇక్కడ మనిషున్నా - ఆలోచనలన్నీ అటే!

నా ఆలోచనలూ - మా ఊరి వైపు సాగాయి.

★ ★ ★

మా ఊరిలో మా ఇల్లు - పాత పెంకుటిల్లు అయినా - విశాలమైన పెరడూ, వసారాలో పెద్ద పెద్ద అరుగుల్తో గడపలూ కళ కళ లాడేది నలుగురితో !

పెరట్లో జామి చెట్లు, కొబ్బరి చెట్లూ - బొప్పాస, సీతాఫలం వుండేవి. రకరకాల పూల మొక్కలు .. ! పెరటిలోకి వెళ్తే - కోతులమైపోయే వాళ్ళం పిల్లలం.

మా ఊరంటే నాకెంతో ఇష్టం. ఊరిని ఆనుకొని యెడతెగకుండా పారే 'వంశధార' నదంటే చాలా ఇష్టం. మునగీత, బారయీత, పక్కయీత .. చేప పిల్లలమయిపోయే వాళ్లం - వంశధారలో.

మా పొలం అంటే మరీ ప్రాణం. అందులో పండే పంటలు ... వేరుశనగ, కందమూలం, దోస, టమాటాలు .. పక్షుల మైపోయేవాళ్ళం పొలంలో !

ఆట, పాట, తిండీ, చదువూ సమస్యలెరుగని బాల్యం గడిచిన గ్రామం ! ఆ గ్రామం లోకి పంచాయితీ రాజకీయాలొచ్చి ఊరిని వార్డులుగానూ, మనుషుల్ని ఓటర్లుగానూ మార్చేయి. ఊరిలోకి ఆఫీసులొచ్చి - ప్రజల మధ్య అంతస్థులు సృష్టించేయి. ఊరిలోకి స్కూళ్ళు వొచ్చి - రైతు బిడ్డల్ని బస్తీల వైపు బ్రతుకు బిక్షకు నెట్టివేసాయి. ఊరిలోకి సారా దుకాణాలొచ్చేయి. సర్కారు చట్టాలొచ్చేయి. కొత్తగా కొన్ని మేడలు లేచాయి. చాలా మిద్దెలూ. పెంకుటిల్లూ - పాకల్లోకి దిగేయి !

రాజకీయాలూ, పంటల్లో వ్యాపారమూ మా నాన్నని సన్నకారు రైతుని చేసాయి. పాలనిండా పశు సంపదా, చెరువు దిగవ పల్లపు భూములూ పోయేయి వర్షాధార మెరక భూమి రెండెకరాలు మిగిలింది. బండీ, ఎడ్లూ తోడుగా నిల్చున్నవి.

మేమంతా చిన్న పిల్లలం. నాకు ముగ్గురు అక్కలు. ఒక్కడ్నే కొడుకునన్న ప్రేమతో యేమో, మా నాన్న నన్ను వ్యవసాయప్పనుల్లోకి దించలేదు. ' బాగా చదువుకో' అనేవాడు. నేనూ బాగా చదువుకునేవాడ్ని. హైస్కూల్ చదువయిపోయింది ! ఆ యేడాదే ... మిగిలిన మూడో అక్కకి పెళ్ళి చేసాడు. నన్ను కాలేజీకి పంపటానికి నాన్న వశం కాలేదు. ఏడాది పాటు యింట్లో వుండిపోయేను.

మెరక మళ్ళ దగ్గర నుయ్యి దవ్వటం ప్రారంభించేడు నాన్న .. వంశధార కాల్వ ఆశకొడిగట్టిందని. నీరుంటే - అన్ని ఋతువుల్లోనా పండిచొచ్చుగదా, కరెంటుంటే మిల్లులు ఆగకుండా నడిపేట్లు !

నుయ్యి పూర్తయింది. గట్టుకి ఆనించి'బాడిశ' చెట్టు నాటేరు. దానికి 'ఏతాం' వేసారు. ఆ యేడాది ఏతాం తొక్కి తోడిన మానాన్న చెమటల్తో చేలన్ని తడిసి బాగా పండేయి. అపుడు నన్ను కాలేజీకి పంపాడు నాన్న. అక్కల పెళ్ళిళ్ళకయిన అప్పులు, నా చదువు కోసం ఖర్చులూ, పండుగలూ, దండుగలూ - నాన్నను గానుగాడించేయి ! డిగ్రీ ఫైనలియర్ ప్రారంభంలోనే నాన్న గుండె నొప్పితో చనిపోయేడు. మా అమ్మే ... తల్లీ తండ్రీ అయ్యింది నాకు . నా డిగ్రీ పూర్తి కావడానికి అమ్మ ఒంటి మీది బంగారం కరిగింది. ఉద్యోగ దరకాస్తు లికీ, యింటర్వ్యూలకీ నాకు చెప్పులు అరిగితే - అమ్మకు అప్పులు పెరిగేయి.

రెండేళ్ళ ఉద్యోగ వేట తర్వాత - బ్యాంకులో క్లర్కుగా సెలక్టయ్యాను. ఎక్కడెక్కడో ఆరేళ్ల పని చేసి విశాఖ చేరాను. ఇన్నాళ్ళూ మా అమ్మ, పొలం పని మీదే అప్పులు తీరుస్తూ వచ్చింది. అక్కల రాకా పోకా చూసింది. ఒంటరిగానే జీవన సముద్రాన్ని యీదింది. అప్పుడే పక్షవాతమొచ్చి, కాలూ, చేయీ పడిపోయింది. విశాఖ తీసుకొచ్చి ఖరీదైన వైద్యం చేయించాను. ఆ సందర్భంలోనే - అమ్మ దండకం చదవటంతో పెళ్ళి చేసుకున్నాను. మా అమ్మకు నయమయ్యింది. ఊరు వెళిపోతానంటే నేనే వొప్పుకోలేదు. తండ్రి ఋణం యెలాగూ తీర్చుకోలేక పోయాను, తల్లి ఋణమైనా తీర్చనీ, అన్నాను. అక్కడి ఇల్లూ, పొలమూ అమ్మేద్దామన్నాను. అమ్మ వొప్పుకోలేదు.

'నేను కళ్ళు మూసింతర్వాత నీ యిష్టం. అమ్మీసుకుంటావో, ఆర్పీసుకుంటావో, అంతదాకా వీల్లేదంది" అమ్మ.

'సరే' అని ఇల్లు అద్దెకిచ్చి, పొలం శిమ్మన్నకి కౌలుకిచ్చేను. మూడేళ్ళయ్యింది. మా అమ్మ పొలాన్నీ, ఆ ఊరినీ విడిచి మాతో వుంటోంది.

గతం నెమరు వేతలో - యే వేకువలోనో నిద్రపోయిన నన్ను ఉదయాన శిమ్మన్నేలేపాడు.

★ ★ ★

"బావూ, నేనెల్లాలి. తమ సెలవేటిసెప్తే ... " అని అడిగేడు.

నేను పరిసరాల్లో వెదికేను అమ్మ కోసం. అమ్మ యిదేమీ యిక పట్టించుకోనట్టుగా - తులసి పూజ చేసుకుంటోంది.

ఏం చెప్పాలో తెలీక, యేదో ఓటి మాట్లాడాలన్న తీరులో -

" ... యీ యేడు వరి పంట యెలాగుంది ?" అనడిగేను.

"ఏం వరి బాబూ? వర్షాలు సరింగలేవు. నూతిలా నీరెండిపోనాది. ఎలాగోలాగ బాధపడి పండిస్తే - యిప్పుడు ఎన్నుగింజకి పురుగొచ్చింది. ఎన్నే రాల్చేస్తంది" విచారించేడు శిమ్మన్న

"పురుగుల మందు కొట్టించలేకపోయావా ?"

" ... యేం మందులూ ? యేమితనాలూ ? ఈ కొత్త రకం యితనాలే యీ బాధలు తెస్తన్నవి. పూర్వం బరువు పంటలేసోలిము. ఎరువులు జల్లీవోలిమి కాదు.పశివిల గత్తమూ, సెరువు మన్నే .. ఎరువు. పండి నంత ... కసింతయినా నిబ్బరమైన పంట ! ఇపుడో ... ? అదిక దిగుబడి హైబ్రీడితనాలకి దిగేము. అవి ఎరువేస్తే గానీ యెదగవు. ఆ ఎరువుతోటే పురుగులూ యెదుగుతున్నాయి. ఆకరికి పొలాలు మందుల్తోటి, ఎరువుల్తోటి నిండిపోయి - చవిటి నేల్లయిపోతన్నాయి. మదుపులు పోతే రైతుకి మిగిలిందేట్లేదు. బావూ, ఎరువులూ, పురుగుల మందుల యాపారమే మేలు యీ రోజుల్ల యవసాయింకంటా .. " అని కడుపు సొద కక్కేడు శిమ్మన్న.

అదే నా పాయింటు గూడా. అందుకనే ఉత్సాహంగా -

" ... అంతే శిమ్మన్నా! వ్యవసాయం కిట్టుబాటు కాని వృత్తి అయిపోయింది. రాబోయే రోజుల్ల - మరీ కష్టం. విత్తనాలూ, ఎరువులూ విదేశీ కంపెనీలమ్ముతాయి. ఈ సబ్సిడీలు గట్రా యేముండవ్. కొనబోతే కొరివీ, అమ్మ బోతే అడివీ - అని రైతులు యిప్పుడు బాధ పడతారా ! ఇక ముందు రోజుల్లో మీరు కొనలేరు, అమ్మడానికి మీ దగ్గరేదీ వుండదు. రాబోయే రోజుల్ల రైతు పరిస్థితి అదీ .. !" అన్నాను - నా విజ్ఞానం మేరకు వ్యవసాయరంగంలో రాబోయే డంకెల్ ప్రభావాన్ని ఊహిస్తూ.

ఆ మాటకు శిమ్మన్న భయపడతాడను కున్నాను. కానీ -

" ... అయితపుడు రైతు వల్లకుంతాడేటిబావ్ ? నేలని తల కిందులు జేసి పండించినోడు .. పాలననీ తల కిందులు జేసి బతుకు పండించుకోడా ? " అని ధీమాగా జవాబు చెప్పాడు.

ఆ జవాబుకి యేమనాలో అర్థంగాక, అపుడే జ్ఞాపకం వచ్చినట్లుగా -"

... యెక్కువ ధరిస్తామని యెక్కి తొక్కేస్తునానరనుకో పడమర రెడ్లు.. " అన్నాను.

శిమ్మన్న నా మొహంలోకి చూస్తూ -

"సేపల పెంపకంకి పొలాన్ని వాడితే .. ఉప్పు నీరు సేరుస్తారు. మందులుకొడతారు. భూమి సారమే కాదు - నీటి ఊటలూ పోతాయి. కొన్నాళ్ళకి పంట భూమి పనికిరాని యెడారయి పోతాది బావ్. తక్కువ పాలిస్తందని, రేటు యెక్కువొస్తాదని కటికోడికి ఆవుని అమ్మీగూడదు బావ్. మీకు సెప్పీవోడ్ని గాను ! నా భూమే అయితే-అమ్మను .. " అన్నాడు ధృడంగా.

మా అమ్మ తులసి తీర్థం తెచ్చి శిమ్మన్న దోసిలిలో పోసి - " ... యీ సారొచ్చినపుడు - చిన్న వేపకొమ్మ పట్రా. పెరట్లపాతుదాం" అని చెప్పి, యింట్లోకి వెలిపోయింది.

శిమ్మన్న నా జవాబు కోసం చూస్తున్నాడు.

"సరే చూద్దాం లే! ఆలోచిస్తాను. నువ్వెళ్లు " అని పంపేసాను శిమ్మన్నని. ఆ యేడాది పొలం అమ్మలేదు. శిమ్మన్న కౌలు గింజలు తగ్గించినా - అమ్మకం గూర్చి ఆలోచించలేదు. కారణం మా అమ్మే!

అయినా మా అమ్మలో పెద్దగా మార్పు రాలేదు. గతంలోవలే గడ గడా మాట్టాడ్డంగానీ, ఇష్టంలేనివి యింట్లో జరిగితే దండకం యెత్తుకోవడం గానీ యేమీ లేవు. ముక్తసరిగా వుండటం, వేళకింత తింటే తినటం .. అంతే ! అంతో యింతో ఉల్లాసంగా .. పాప దగ్గరైతేనే.

ఇంతలో నాకు ప్రమోషనొచ్చింది. హైదరాబాద్ బదిలీ అయ్యింది.

* * *

మా కొత్త యింటిని అద్దెకిచ్చి, మా అమ్మను తీసుకొని హైద్రాబాద్ వెళిపోయేము. హైద్రాబాద్ వచ్చేక - మా అమ్మ మరింతగా మౌన ముద్రలోకి వెలిపోయింది. అటూ యిటూ తిరుగాడ వీలు లేని అపార్ట్‌మెంట్ నివాసం - అడవిపక్షి బోనులో చిక్కినట్లుగా వుంది మా అమ్మ స్థితి. దానికితోడు పాప మా దగ్గర నుండి దూరమైంది.

మా సద్గుణా వాళ్ళ అమ్మా నాన్న హైద్రాబాద్ లో వుంటున్నారు. వారున్న యేరియాలో కాన్వెంటు మంచిదని పాపను తాతగారింట వుంచేము. అపుడపుడూ మేము వెళ్ళి వస్తుంటాం.

మా అమ్మ మరీ ఒంటరిదైంది ఊరి వైపు ఆలోచనలూ, పొలం పైన ఆశలూ, పాప మీద ప్రేమా .. అమ్మ ఆరోగ్యాన్ని దెబ్బ తీసాయి. మంచం పట్టింది. ఏ వైద్యమూ ప్రయోజనం యివ్వటం లేదు. కారణాలు తెలుసు ! కానీ యెలా ? నా బ్రతుకు యాతనలో యీ పరుగులు తప్పవుగదా!

ఇంతలో సద్గుణ వాళ్ల కన్నవారింటి దగ్గరే పాత బిల్డింగొకటి - మంచిదే - అమ్మకానికొచ్చింది. చవకగా దొరుకుతోంది. విశాల మైన బిల్డింగ్, పెరట్లో నుయ్యి, వేప,జామి చెట్లూ ..నాలుగ్గదుల బిల్డింగ్ !

అంతే ! అమ్మకు చెప్పకుండా విశాఖలో యిల్లూ, ఊరిలో పొలమూ అమ్మేసి - ఆ బిల్డింగ్ కొనేసాను.

మా అమ్మ - ఆ బిల్డింగ్‌లోకి వచ్చేక కొద్దిగా తేరుకుంది.

పెరట్లో వేప చెట్టు దగ్గర కూర్చొని .. గలగలా మాట్లాడ్తోంది పాపతో ! ఇప్పుడు పాపను మాతోనే వుంచుతున్నాం, ఆ కాన్వెంట్ దగ్గర గనుక !

నాకు చాలా సంతోషం వేసింది. అమ్మతో కల్పించుకుని అవీ, యివీ మాట్లాడడం అలవాటు చేసుకున్నాను. ఓ రోజు -

" ... యింత దూరం శిమ్మన్న రాలేడు. ఈ సారి సంక్రాంతికి ఊరెల్తాన్రా బాబూ. గుమ్మడి పండు తేవాల. అప్పాలు చేద్దాం. గుమ్మడి కాయ అప్పాలు యెలాతినేవాడివి తెల్సా? అదీ గాక పప్పు దినుసులు అన్నీ తేవచ్చు - యీ కల్తీకవర్ల సరుకంటే నాకు అసయ్యిం. ఊరెల్తాను సంక్రాంతికి !" అంది మా అమ్మ. నాగుండెల్లో రాయి పడింది. ఆమె అనారోగ్యాన్ని గుర్తు జేసి - " అంతదూర ప్రయాణం మంచిది కాదు" అన్నాను.

అందుకు అమ్మ, యేమాత్రం లెక్కజేయక, అదే గొప్పలా భావించి -

" అంత అదృష్టమా ? సొంత మట్టి మీద ఊపిరి పోతే యింకేటి కావాల ! బాబొరే .. నేను గానీ యిక్కడ చచ్చిపోతే - ఆస్తికలేనా ..వంశధారల కలిపిమీ"అంది మా అమ్మ, అదో అపూర్వమైన కోరికలా !

★ ★ ★

మా అమ్మను సంక్రాంతికి ఊరు పంపించలేదు. కానీ, మా అమ్మ కోర్కె తీర్చేందుకు .. అస్తికలతో శివరాత్రి ముందరిరోజు రైలెక్కాను మా ఊరు వెళ్ళేందుకు!

తెల్లగా తెలవారి పోయింది. శివరాత్రిరోజులు - చలి శివ, శివా అంటూ పోయే దారిలో వుంది. రైల్వేస్టేషన్ నించి అరగంట నడక దూరం మా ఊరు. అమ్మ అస్థికల్తో - మౌనంగా నడుస్తున్నాను. ఆ రోజు ఆదివారం. ఊరి ముందరి తోటలో సంత జరుగుతోంది.

సంతలో - చాలా మంది కొత్తగా చూసేరు నన్ను. కొద్ది మందే పోల్చుకు న్నారు. "ఏం బాబూ? బాగున్నావా ? ఇదేనారావటం? రాజులమ్మ చచ్చిపోయిందంట గదా?" ప్రశ్నల్తో పలకరించేరు.సంతలోనే మా మేనమామ కొడుకు కనిపించేడు. ఇంటికి తీసుకువెళ్లాడు. నా చిన్నప్పుడు తిరుగాడిన తాతగారిల్లు- శిధిలదేవాలయంలా కన్పించింది. మా మేనత్త నన్ను పోల్చుకొని యేడుపందుకుంది మా అమ్మను తల్చుకొని.

"కడసారి సూపుకేన కరువయిపోనావు తల్లో ! పుట్టి నూరిల బుగ్గి జెయ్యిమని బూడిది పంపేవ వొదినా .. " అంటూ మా అమ్మతోటి తన అనుబంధాన్నంతటినీ రాగాలుతీసి యేడ్చింది.

గడపలో నులక మంచమొకటి వేసి, అతుకుల బొంత తెచ్చి వేసి - కూర్చోమన్నాడు మా మేనమామ కొడుకు. నేను కూర్చుండేసరికి - మంచం కోడు ఒకటి కుసిజారిపోయి ... ఫెళ ఫెళమంది. గాభరాగా లేచిపోయేను.

మా అత్త యేడుపులాపి - " ఆ మంచమేత్ర యేసినావు. పోనీ అదే తిరగేసి పడిమంచమెయ్యి" అంది. మా బావ మంచాన్ని తిరగేసి పడిమంచమేసాడు. ఎత్తుగా వున్న మంచం నేలని ఆనింది !

" .. ఇది నాయన మా బతుకు ! ఇరిగిన మంచం, వొరిగిన పంచలూ, కరువొట్టిన కంచాలూ ! పంటలు పండవూ ! బతుకులు దిన దిన గండాలు ... " అని నాలుగు ముక్కల్లో నాకు వారి జీవితాన్ని మంచం చూపి తెల్పింది మా మేనత్త.

ఆ సాయంత్రం .. నాలుగ్గంటల వేళ .. మా బావ తోడురాగా .. వంశధార నదికి వెళ్ళాను. గల, గలా స్వచ్ఛంగా .. నిండుగా వంశధార పారుతోంది. మా అమ్మ అస్తికలను .. కలిపేసి, వంశధారకు చేతులెత్తి మొక్కాను. ఎందుకో కన్నీరు ఆగలేదు. మా బావ నా కన్నీరు చూసి, తనూ భోరుమన్నాడు. కొంతసేపు యిద్దరమూ యేడ్చేడ్చి .. వొడ్డెక్కాం !

ఒడ్డెక్కాక మా బావ - " బాధపడకు .అత్త ఋణం తీర్చుకున్నావు. నీతో పాటే పట్నాలు చూపేవు. ముసిలి కాలంల అత్తని సుకంగా పోషించేవు " అని నన్ను అమనయించేడు.

కానీ నా మనసే అంగీకరించలేదు. అమ్మ ఋణం తీర్చానా ? అమ్మ కోర్కెతీర్చానా ? ఇల్లు వుంచేనా ? పొలం వుంచేనా ? ఊరు రానిచ్చేనా ? ఏ కోర్కె తీర్చాను ? ఏదీ తీర్చలేదు.

ఇద్దరం ఊరి వైపు నడుస్తున్నాం. గాలి .. పొలాల మీదుగా పొలుసు వాసనల్ని మోసుకొస్తోంది. పైర గాలికి బదులుగా చేపల పొలుసు వాసన ! ముక్కు మూసుకున్నాను. నన్ను చూసి - " ... ఈ యేరియా భూముల్ల చేపల పెంపకం యెక్కువైంది. రైతులూ దిగిపోతన్ను. పట్నం యాపారమొచ్చి - రైతుని బాగుజేసిందా - పరాయి దేశం యాపారం బాగుసెయ్యడంకి ? ఏలం యెర్రి ! ఎవులో నాలాంటోళ్ళ భూములు తప్ప మిగతావి చేపల చెరువులయినాయి..." అన్నాడు మా బావ!

తిన్నగా ఊరి ముందరి తోట కొచ్చేం. సంత విరిగి పోయింది. జనం వెళ్లిపోయేరు. ఓ చెట్టు కింద చింపిరి జుత్తుతో - ఎండిన బీరపాదులా - ఒకతను కూర్చున్నాడు. ఎదురుగా చిరిగి పోయిన తలపాగా గుడ్డ పరిచేడు. దాని మీద చిన్న పోపుడబ్బా పెట్టి, దాని పైన ఓ మామిడి టెంక చిన్న రెమ్మల్తో నున్న దాని ని - నిలబెట్టాడు.

గాలిలో చేతులు ఆడిస్తూ, ఆకాశంలోకి చూస్తూ, తలపాగా గుడ్డను సర్దుతూ -

" ... సూస్కోండి, సూస్కోండి. మీరు చూస్తుండగే ... యీ టెంక చెట్టు అయిపోద్ది. చెట్టుకి కొమ్మలే కొమ్మలు. కొమ్మ కొమ్మకీ ... గుత్తులు గుత్తులు కాయలు! మీకు సేతులు సాలవు తెంపడంకి ! కొమ్మలు నరక్కండీ, తప్పు, చెట్టు గొట్టీ కండీ .. చెడిపోతారు! హి .. హి.. హి... రండి, రండి తినండి, పంట సంసారం కాదు, రండి, రండి " అంటూ శూన్యంలోకి చూస్తూ పిలుస్తున్నాడు.

నేను అటుగా నడిచేను. ఆ వ్యక్తి నన్ను గుర్తు పట్ట లేదు. ఎండిన బీరపాదుని పోల్చాను - శిమ్మన్న !

నా గుండె దడ, దడా కొట్టుకుంది. గబ, గబా అక్కడ్నించి ఊర్లోకొచ్చీసాను. మనసులో యెన్నెన్నో ప్రశ్నల ప్రభంజనాలు !

ఊరి మీదా, పొలం మీదా, యింటి మీదా - మమకారాన్ని వొదులు కోలేక మా అమ్మ - యీ లోకాన్ని వొదిలేసింది.

పొలం మీదా, పంటల మీదా మమకారాన్ని మార్చుకోలేక - శిమ్మన్న పిచ్చివాడైపోయాడు.

బస్తీ నుండి పట్నానికీ, పట్నం నుండి నగరానికీ పరుగెడ్తూ, పోటీ పడ్తూ ... అందని అంతస్థుల కోసం - మమకారాలకూ, మమతలకూ, అనుబంధాలకూ యిన్‌స్టాల్ మెంట్లవారీగా చెల్లు చీటి రాస్తోన్న నేనూ, నా తరం ... ముందుకి వెల్తున్నామా ? వెనక్కా ? ఈ పరుగులు యెటు ... ?

తంత్రులు తెగిన వీణలా మౌనంగా - సూట్‌కేస్‌సర్దుకొని, మా మేనత్తా, బావా, యెందరు బ్రతిమాలినా, ఆగకుండా - తిరుగు ప్రయాణమయ్యాను.

రైల్వే స్టేషను దాకా నన్ను వెంటాడింది- ఊరిమీదుగా గాలిలో పొలుసు వాసన.

*(రచన మాసపత్రిక మే 1994)*

★ ★ ★